# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-04-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రెపో రేటును 0.25 శాతం మేర తగ్గిస్తున్నామని భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు.**
2. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఆదాయార్జన శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు.**
3. **వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
4. **'మనమిత్ర' యాప్‌లోనూ పరీక్షల ఫలితాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు.**
5. **వెనుకబడిన వర్గాల జీవనోపాధికి,వారి ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.**

==========================

రెపో రేటును 0.25 శాతం మేర తగ్గిస్తున్నామని భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ముంబైలో ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆయన ఈరోజు పాత్రికేయులకు వెల్లడించారు. మోనెటరీటరీ పాలసీ కమిటీ రెపో రేటు తగ్గింపు నిర్ణయానికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.5శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయని ఆయన తెలియజేస్తూ,

వాయిస్ 26 సెకన్లు

--------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆదాయ ఆర్జన శాఖలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు తీసుకోవలసిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. కాగా.. ఈ మధ్యాహ్నం గనుల శాఖపై కూడా సమీక్ష నిర్వహిస్తారు.

ఇది ఇలాఉండగా.. రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి .. తన సొంతింటి నిర్మాణానికి ఈరోజు శంకుస్థాపన చేశారు.

---------------------------

ప్రకాశం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వెలిగొండ ప్రాజెక్టు పురోగతిపై సంబంధిత అధికారులతో మంత్రి ఈరోజు దృశ్యమాధ్యమం విధానంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెలిగొండ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక దృష్టి సారించిందని అన్నారు. ప్రాజెక్టు పూర్తవ్వాలంటే 4 వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయని చెప్పారు.

---------------------------

'మనమిత్ర' యాప్‌లోనూ పరీక్షల ఫలితాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో విద్యాశాఖ సంస్కరణలు, మెగా డీఎస్సీ, పది, ఇంటర్మీడియట్ ఫలితాలు, డ్యాష్ బోర్డు రూపకల్పనపై అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, న్యాయపరమైన చిక్కులు లేకుండా మెగా డీఎస్సీ ప్రకటనకు ఏర్పాట్లు చేయాలన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల విడుదలకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆగస్టు నెలలో వివిధ రాష్ట్రాల విద్యామంత్రుల కాంక్లేవ్‌ను రాష్ట్రంలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

---------------------------

ప్రధానమంత్రి ముద్ర యోజన 10వ వార్షికోత్సవం సందర్భంగా లబ్దిదారులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిన్న ఢిల్లీలోని తన నివాసంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆ రుణాల ద్వారా ఎదిగిన తీరును ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలుగులో వివరించారు. ముద్ర యోజన ద్వారా ఎటువంటి హామీలు లేకుండా రుణాలను పొందగల్గుతున్నామని తెలిపారు. వీటి ద్వారా జనపనార సంచులను తయారు చేస్తున్నామని తెలుపుతూ,

వాయిస్ ...31 సెకన్లు

---------------------------

ప్రయాణికులకు ఆర్టీసీ ద్వారా నాణ్యమైన రవాణా సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో 12 నూతన ఆర్టీసీ బస్సులను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాయచోటిలో ప్రస్తుతం ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని 3 సూపర్ డీలక్స్‌లు, 2 అల్ట్రా డీలక్స్ లు, ఎక్స్‌ప్రెస్, 2 పల్లె వెలుగు బస్సులను ప్రారంభించామని చెప్పారు. ప్రయాణికుల కోసం రాబోయే నాలుగు సంవత్సరాలలో 2 వేల ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు.

---------------------------

ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో నిర్వహించే మహాత్మా జ్యోతిరావు పూలే రాష్ట్రస్థాయి జయంతి ఉత్సవాలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారని గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి

తెలిపారు. ఆగిరిపల్లిలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాల జీవనోపాధికి,వారి ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని అన్నారు. ఆదరణ పథకం కింద బీసీలకు రుణాలు మంజూరు చేయనున్నామని తెలియజేస్తూ..

..వాయిస్... 27 సెకన్లు

----------------------------

పోషన్ అభియాన్ పథకం కింద బాలింతలకు, చిన్నారులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నామని టెక్కలి సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం-ఐసీడీఎస్ అధికారి పి.శోభారాణి చెప్పారు. పోషణ పక్షోత్సవాలలో భాగంగా శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ, జిల్లాలోని మూడు వేల అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఈ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. పోషకాహార ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఆమె పేర్కొంటూ,

వాయిస్ .. 29 సెకన్లు

----------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి కోరారు తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రాలను ఆయన ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత వినియోగం ద్వారా రైతులు అధిక దిగుబడిని సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోదని అన్నారు. చిన్న, సన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

----------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్....30 సెకన్లు....

----------------------------

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని బాపట్ల శాసనసభ్యులు వి.నరేంద్ర వర్మ రాజు అన్నారు. బాపట్ల నియోజకవర్గంలో నిర్వహించిన 'మన వార్డు -మన ఎమ్మెల్యే ' కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొని స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించేందుకు నియోజకవర్గంలో వ్యాప్తంగా పర్యటిస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామని తెలిపారు.

====================